క్లుప్తంగా

బాధిత కుటుంబానికి పరామర్శ



పర్వతగిరి: ఏనుమాముల మార్కెట్ మాజీ చైర్మన్, మండలంలోని ఏనుగల్ గ్రామానికి చెందిన తక్కళ్లపల్లి నారాయణరావు తల్లి సుభద్రాదేవి ఇటీవల మృతి చెందగా ఆదివారం దశ దిన కర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొని మృతురాలి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఎం.మనోజ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

పర్వతగిరి: మండలంలోని తీగరాజుపల్లి ఎస్సారెస్పీ కాల్వ వద్ద వరంగల్‌లోని ఎల్‌బీ నగర్ ప్రాంతానికి చెందిన యువకుడు రహమాన్ కాల్వలోకి దూకాడు. నీరు ఎక్కువగా ప్రవహిస్తుండడంతో అతని ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. పక్కనే ఉన్న అతని స్నేహితుడు కలీం రహమాన్‌ను కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. ప్రేమలో విఫలమై ఆత్మహత్యాయత్నం చేసుకున్నట్లు అతని స్నేహితుడు తెలిపారు. పోలీసులు రహమాన్ ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. రాయపర్తి మండలం మైలారం వరకు రహమాన్ కొట్టుకుపోయినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

కుర్చీలు వేసే సంప్రదాయం సరికాదు..

వర్ధన్నపేట: భగవంతుడి ఎదుట అందరూ సమానమేనని, కొందరికి మాత్రమే కుర్చీలు వేసే సంప్రదాయం సరికాదని మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ పేర్కొన్నారు. వర్ధన్నపేటలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన కల్యాణోత్సవానికి ఆయన హాజరయ్యారు. కల్యాణ వేదిక ఎదుట కేవలం అధికారులకు కుర్చీలు వేయడం, కొంతమంది నేతలకు మర్యాద చేయడంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. సామాన్య భక్తుల మాదిరిగానే బెంచీపై కొండేటి శ్రీధర్ కొంత సేపు కూర్చుని అసహనంతో వెళ్లిపోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ అంశం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

తీవ్రంగా ఖండిస్తున్నా : ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

వర్ధన్నపేట పట్టణంలోని సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవంలో మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్‌కు జరిగిన చేదు అనుభవాన్ని తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓ మాజీ దళిత ప్రజాప్రతినిధిని ఇలా అవమానించడం సరికాదన్నారు. ఈ సంఘటనను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా చూస్తామని ఎమ్మెల్యే నాగరాజు తెలిపారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

ఆత్మకూరు : ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆరుట్ల మాధవమూర్తి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అలాగే ఆత్మకూరు, గుడెప్పాడ్, అక్కంపేటలో సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఆయన వెంట పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

కమలాపూర్ : శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ హెచ్చరించారు. కమలాపూర్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘంలో తలెత్తిన విభేదాల నేపథ్యంలో ఇరువర్గాలకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. వ్యక్తిగత విషయాలు, వర్గ విభేదాలు, ఇతర నగదు లావాదేవీలకు సంబంధించిన సమస్యలను ఎవరి మనోభావాలు దెబ్బతినకుండా, ఎవరికి ఇబ్బంది కలుగకుండా రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని సూచించారు.

బైక్ ర్యాలీని జయప్రదం చేయాలి

ఆత్మకూరు : ఈనెల 12వ తేదీన హిందూ ధర్మ రక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న బైక్‌ర్యాలీని జయప్రదం చేయాలని గుడెప్పాడ్ రామాలయం అర్చకుడు ఆరుట్ల కేశవమూర్తి పిలుపునిచ్చారు. మండలంలోని గుడెప్పాడ్ రామాలయంలో ఆదివారం అందుకు సంబంధించిన వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఈనెల 12వ న ఆలయం నుంచి ఆత్మకూరు వేణుగోపాలస్వామి ఆలయం వరకు ర్యాలీ కొనసాగుతుందని, సాంబయ్య, ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.

లక్ష్యానికి మించి రుణాలు

మహిళా సంఘాల రుణాల పంపిణీలో గీసుకొండ టాప్

- 2024–2025లో రూ.545.91 కోట్లు పంపిణీ
- గత ఏడాది కూడా జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిన మండలం



ఎస్‌హెచ్‌జీలకు బ్యాంకు లింకేజీ రుణాల మంజూరు చెక్కు అందిస్తున్న అధికారులు(ఫైల్)

గీసుకొండ: స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ) ఆర్థిక బలోపేతానికి ప్రభుత్వం బ్యాంకు లింకేజీ రుణాలను అందిస్తోంది. ఈ క్రమంలో 2024–2025 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో లింకేజీ రుణాల పంపిణీలో జిల్లాలోనే గీసుకొండ మండలం టాప్‌గా నిలిచింది. గత ఏడాది కూడా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిన మండలం ఈసారి కూడా అదే ఒరవడిని కొనసాగించింది. 2003–2004లో రూ.30 కోట్ల మేర రుణ లక్ష్యం ఉండగా రూ.53 కోట్ల రుణాలు అందించి మండలం జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ఏపీఎం సురేశ్‌కుమార్‌తోపాటు మండల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులను మంత్రి సీతక్క, అప్పటి సెర్ప్ సీఈఓ అనితారామచంద్రన్ తదితరులు హైదరాబాద్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సన్మానించారు. ఈ ఏడాది కూడా పొదుపు సంఘాల మహిళలకు లింకేజీ రుణాలు అందించడంలో మండలం మొదటి స్థానంలో నిలవడం విశేషం.

ఆర్థికాభివృద్ధికి ఊతం..

స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు ఆర్థికంగా, పారిశ్రామికవేత్తల స్థాయికి ఎదిగేందుకు లింకేజీ రుణాలు ఊతం ఇస్తాయి. సంఘాల్లోని మహిళలకు ఎవరికి రుణం అవసరమో ముందుగా గుర్తించి పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) అధికారులు, మండల సమాఖ్య నిర్వాహకులు, ఏటల వారీగా రుణప్రణాళిక తయారు చేస్తారు. ఎస్‌హెచ్‌జీలోని సభ్యులకు కుట్టుమిషన్లు, పిండిగిర్ని, కిరాణం, బట్టల షాపు, గేదెలు, గొర్రెలు, మేకల పెంపకం, వ్యవసాయ పనిముట్లు, పెట్టుబడి సహాయం, శానిటరీ న్యాప్కిన్ల తయారీ.. ఇలా అనేక రకాల వ్యవసాయ, వ్యవసాయేతర రంగాలకు సంబంధించిన రుణాలు ఇస్తారు. ఒక్కో సంఘానికి రూ. రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రుణాలు అందిస్తుండటంతో వారి జీవనోపాధి మెరుగుపడుతోంది.

లింకేజీ రుణాలు అందించారు ఇలా..

జిల్లాలో 2024–25 సంవత్సరంలో 9,214 స్వయం సహాయక సంఘాలకు సుమారు రూ.513.45 కోట్ల రుణాల పంపిణీ లక్ష్యం కాగా ఆర్థిక సంవత్సరం ముగిసే వరకు 6,540 సంఘాలకు రూ.545.91 కోట్ల రుణాలను (106.32 శాతం) పంపిణీ చేశారు.

మండలాల వారీగా ఎస్‌హెచ్‌జీలు, పంపిణీ చేసిన రుణాల వివరాలు..

మండలం	ఎస్‌హెచ్‌జీల లక్ష్యం	పంపిణీ చేయాల్సిన రుణాలు	తీసుకున్న ఎస్‌హెచ్‌జీలు	పంపిణీ చేసిన రుణాలు (రూ.లక్షల్లో)	శాతం
గీసుకొండ	535	3,576,60	828	5,850.21	163.57
నెక్కొండ	1075	5,541.52	566	6,734.38	121.53
సంగెం	1015	5,828.63	705	6,946.64	119.18
పర్వతగిరి	939	5,039.02	545	5,860.63	116.30
నర్సంపేట	758	4,245.13	552	4,862.46	114.54
రాయపర్తి	966	4,937.27	748	5,424.66	109.87
చెన్నారావుపేట	716	4,156.78	642	4,203.51	101.12
ఖానాపురం	738	3,793.76	542	3,638.69	95.91
వర్ధన్నపేట	716	4,520.36	447	4,023.19	89.00
నల్లబెల్లి	784	4,367.97	505	3,822.64	87.52
దుగ్గొండి	972	5,338.46	460	3,224.93	60.41
మొత్తం:	9,214	51,345.50	6,540	54,591,94	106.32

అందరి సహకారంతోనే..



బ్యాంకులు, సంబంధిత శాఖల అధికారులు, ఏఓలు, సీసీలు, సెర్ప్ ఉద్యోగుల సహకారంతో పొదుపు సంఘాల మహిళలకు రుణాలు రుణాలు తీసుకున్నారు. తీసుకున్న రుణాలను సకాలంలో స్వయం సహాయక సంఘాల మహిళలు చెల్లిస్తుండటంతో గీసుకొండ మండలం రుణాల పంపిణీ, చెల్లింపుల్లో ముందు నిలిచింది. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తాం.

–సురేశ్‌కుమార్, ఏపీఎం

ఔట్ సోర్సింగ్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

● గోనె యువరాజు

నర్సంపేట: నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో 20 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న 15 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను జిల్లా ఆస్పత్రిలో విధుల్లోకి తీసుకోవాలని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో యువరాజు మాట్లాడారు. గత కొన్నేళ్లుగా సీహెచ్‌సీ ఏరియా ఆస్పత్రిలో వైద్య విధాన పరిషత్ పరిధిలో ఏఎన్‌ఎం, ఎల్‌టీఎల్‌ఈ, డీఆర్‌ఏ, ఎంఎన్ఓ, జీఎస్‌డబ్ల్యూ, ఎస్‌జీ, పీసీసీ, ఈసీడీ తదితర విభాగాల్లో అమ్మ ఏజెన్సీ కింద పని చేస్తూ చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషిస్తున్నారు. ఇప్పుడు జిల్లా ఆస్పత్రిగా అప్ గ్రేడ్ అయి మెడికల్ కళాశాలగా రూపుదిద్దుకున్న తర్వాత మెడికల్ కళాశాల, జిల్లా ఆస్పత్రిలో పర్మినెంట్ ప్రభుత్వ ఉద్యోగాలతోపాటు సుమారు 150కి పైగా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పోస్టులు మంజూరయ్యాయి. ఆ పోస్టుల్లో సీనియారిటీ ప్రకారం వీరికి అవకాశం కల్పించకుండా ఏజెన్సీ రెన్యూవల్ సమయం అయిపోయిందని, ఏజెన్సీ జిల్లా ఆస్పత్రి పరిధిలోకి రాదని విధుల నుంచి తొలగించడం అన్యాయం అన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను అప్‌గ్రేడ్ అయిన జిల్లా ఆస్పత్రిలో కొనసాగించాలని జీఓ ఉన్నప్పటికీ.. రాజకీయ ఒత్తిడితో ఆ జీఓను పట్టించుకోవడం లేదన్నారు. ఫలితంగా ఇప్పుడు కార్మిక కుటుంబాలు రోడ్డున పడాల్సిన పరిస్థితి వచ్చిందని, కొత్తగా మంజూరైన 150పోస్టులలో ఏజెన్సీ వారు పారదర్శకంగా నియామకాలు చేపట్టకుండా తమకు అనుకూలంగా ఉన్న వారికి రాజకీయ ఒత్తిడితో అవినీతికి పాల్పడుతున్న ఆరోపణలు ఉన్నాయన్నారు. పాతవారిని కొనసాగిస్తే వారికి వచ్చే ముడుపులు రావనే దురుద్దేశంతో వీరిని తొలగించడం అన్యాయం అని ఆరోపించారు. జిల్లా కలెక్టర్ డీఎంఈ స్పందించి చొరవ చూపి వారికి న్యాయం జరిగే విధంగా చూడాలని కోరారు.

'ఆరోపణలు చేసినవారిపై చర్య తీసుకోవాలి'



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పర్వతగిరి: అసత్య ఆరోపణలు, వీడియోలు చేసిన వారిపై చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు శనివారం మండలంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొనగా ఎమ్మెల్యే నాగరాజు, కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టతకు భంగం కలిగేలా కొన్ని వీడియోలు వైరల్ చేస్తూ ప్రజలకు తప్పుడు సమాచారం తెలిపిన కొంత మంది వ్యక్తులపై ఆదివారం పర్వతగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే నాగరాజు నిరంతరం పేదలు, ఈ ప్రాంత అభివృద్ధి కోసం పని చేస్తుంటే పది సంవత్సరాలు ఏమీ చేయని టీఆర్‌ఎస్ నాయకులు ప్రస్తుతం అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి భయంతో ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. టీఆర్‌ఎస్ నాయకులు చేసిన అభివృద్ధి ఏంటో, కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి ఏంటో ప్రజలకు తెలుసన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 15నెలల్లోనే అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు కల్పించడం జరిగిందన్నారు. శనివారం జరిగిన జై భీమ్, జై బాబు, జై సంవిధాన్ కార్యక్రమం సందర్భంగా ప్రజలు, పార్టీ కార్యకర్తలులతో కలిసి సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశాన్ని కొంత మంది టీఆర్‌ఎస్ నాయకులు ఆ వీడియోలు తీసి లేని పోని ఆరోపణలు చేసుకుంటూ సోషల్ మీడియా, యూట్యూబ్ ఛానెళ్లలో వేరే విధంగా ప్రచారం చేశారన్నారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందికట్ల అనిల్, నాయకుడు పిన్నింటి సునీల్‌రావు, ఐనవోలు దేవస్థానం డైరెక్టర్ దారం పూర్ణచందర్, కుసం రామచందర్, బొట్ల మహేందర్, మాసాని సువార్త, తొర్రి పద్మ, గొడుగు వినయ్, కొమ్ము రమేష్, వంగ సాయి, బొట్ల వెంకన్న పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



వర్ధన్నపేట: కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్

భారతీయ జనతాపార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. గ్రామాలు, పట్టణాల్లో పార్టీ జెండాను ఎగురవేసి, సంబురాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా పలువురు పార్టీ నాయకులు మాట్లాడుతూ.. దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా.. దేశాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తుందని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



నర్సంపేట: వేడుకల్లో పాల్గొన్న బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాణాప్రతాప్‌రెడ్డి, నాయకులు



సంగెం: మాట్లాడుతున్న డాక్టర్ కాళీప్రసాదరావు

బీసీ బిల్లు పార్లమెంట్‌లో ఆమోదింపజేయాలి

● తుమ్మల కుమారస్వామి



మాట్లాడుతున్న తుమ్మల కుమారస్వామి

వర్ధన్నపేట: బీసీ బిల్లుకు పార్లమెంట్‌లో బీజేపీ ఆమోదింపజేయాలని లేని పక్షంలో దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం(డీఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి అన్నారు. ఆదివారం వర్ధన్నపేట పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జనాభాలో 52 శాతం ఉన్న బీసీలకు 42 శాతం విద్య, ఉద్యోగాల్లో, రాజకీయంగా రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు తెలంగాణలో ఉన్న బీజేపీ ఎమ్మెల్యేలు 8 మంది, ఎంపీలు 8 మంది, ఇద్దరు కేంద్ర మంత్రులు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని డిమాండ్ చేశారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ బీసీ అని ఆయన బీసీల బాధ అర్థం చేసుకోవాలని కోరారు. బీసీ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదింపజేయకుంటే రాష్ట్రంలో రాబోవు ఎన్నికల్లో బీసీలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో నాయకులు కంజర్ల సమ్మయ్య, చల్ల మిధున్, అరుణ్, చిన్నపెల్లి బాబు, కొండేటి రామచంద్రు తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణతో మహిళలకు ఉపాధి



మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న వెంకట్‌రెడ్డి

సంగెం: కుట్టు శిక్షణతో మహిళలు స్వయం ఉపాధిని పొందవచ్చని లయన్స్ క్లబ్ గవర్నర్ కుందురు వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని గవిచర్లలో లైయన్స్ క్లబ్ హనుమకొండ కనకదుర్గ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఆదివారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుట్టుశిక్షణ పొందినవారికి టెక్స్‌టైల్ పార్కు వంటి కంపెనీల్లో ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. నిరుపేద మహిళలకు కుట్టు మిషన్లు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఉమాదేవి, మాజీ ప్రెసిడెంట్ వనజ, జిల్లా సెక్రటరీ సులోచన, సెకండ్ వైస్ జిల్లా గవర్నర్ నరహరి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం గ్రామాలు, పట్టణాల్లోని ఆలయాల్లో శ్రీసీతారాముల కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీతారాముల విగ్రహాలకు ఎదుర్కోలు, మాంగళ్య ధారణ, తలంబ్రాల వేడుకలను నిర్వహించారు. ఈ కల్యాణ తంతును భక్తులు అధిక సంఖ్యలో హాజరై వీక్షించారు. అనంతరం ఆయా వేడుకల వద్ద చేపట్టిన అన్నదాన కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



నర్సంపేట: చెన్నారావుపేట శ్రీసిద్ధేశ్వర ఆలయానికి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు



నల్లబెల్లిలో..



నెక్కొండ: తలంబ్రాలు తీసుకొస్తున్న భక్తులు



నర్సంపేట రూరల్: వేడుక నిర్వహిస్తున్న పండితులు



దుగ్గొండి: కేశవాపురంలో..



సంగెం: మండల కేంద్రంలో..



వర్ధన్నపేట: పట్టు వస్త్రాలను తీసుకొస్తున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి



గీసుకొండ: కీర్తినగర్‌లో తాళి చూపుతున్న అర్చకులు



రాయపర్తి: మైలారంలో పాల్గొన్న ఎర్రబెల్లి..



ఖానాపురం: రంగాపురంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది

ఊరుగొండలో దొంగల హల్‌చల్

దామెర : విద్యుత్ మోటార్లను ధ్వంసం చేసి కాపర్ వైరు, సర్వీసు వైర్లు ఎత్తుకెళ్లిన ఘటన మండలంలోని ఊరుగొండలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై కొంక అశోక్ తెలిసిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పలువురు రైతులు ఎస్సారెస్పీ కెనాల్ నుంచి పంటలకు నీరు పెట్టేందుకు విద్యుత్ మోటార్లు అమర్చారు. ఆదివారం ఉదయం రైతులు వెళ్లి చూడగా 12 మంది రైతులకు సంబంధించిన విద్యుత్ మోటార్లు ధ్వంసం కావడంతో పాటు కాపర్‌వైరు కనిపించలేదు. అలాగే పైప్‌పులు, మోటార్లు కెనాల్‌లో పడేసి ఉన్నాయి. 12 మోటార్ల విలువ సుమారు రూ.3లక్షల ఉంటుందని, అపహరణకు గురైన కాపర్‌వైరు విలువ సుమారు రూ.18,400 ఉంటుందని బాధితులు తెలిపారు. వీటితో పాటు 20 మీటర్ల సర్వీస్ వైరు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. బాధితుల పక్షాన గ్రామానికి చెందిన మోటె రవి ఫిర్యాదుచేయగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్సపొందుతున్న యువకుడి మృతి

ఆత్మకూరు : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లబెల్లి మండలం రేలకుంటకు చెందిన కూచన నవనీత్ (21) మిత్రులతో కలిసి ఈనెల 4న బైక్‌పై నీరుకుళ్లకు ఓ శుభకార్యానికి వచ్చారు. తిరిగి రేలకుంటకు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి విద్యుత్ స్తంభానికి ఢీ కొట్టాడు. దీంతో అతడికి తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో స్థానికులు, తోటిమిత్రులు గుర్తించి వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమితం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మళ్లీ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. మృతుడి తల్లి కూచన స్వరాజ్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆత్మకూరు సీఐ సంతోశ్ వెల్లడించారు.